క్లుప్తంగా

అల్లూరి విజ్ఞాన కేంద్రంలో వైద్య శిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

డాబాగార్డెన్స్ : అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. గైనకాలజీ వైద్యులు జి. అవంతి మహిళలకు సమస్యలపై వివరించి పలువురు మహిళలకు చికిత్స అందజేశారు. అలాగే ప్రముఖ చర్మవ్యాధుల నిపుణుడు తేజ వినోద్ చర్మ సంబంధిత వ్యాధులను పరీక్షించారు. కీళ్లు, షుగర్, పిల్లలు, కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అల్లూరి విజ్ఞాన కేంద్రం చైర్మన్ వీఎస్ పద్మనాభరాజు మాట్లాడుతూ ప్రతినెలా అల్లూరి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తూ, వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

నేటి నుంచి మిజోరం గవర్నర్ పర్యటన

మహారాణిపేట: మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు ఈ నెల 21 నుంచి 30వ తేదీ వరకు విశాఖపట్నం జిల్లాలో పర్యటించనున్నారు. ఆయన శనివారం మధ్యాహ్నం విశాఖ చేరుకుంటారు. 23వ తేదీ వరకు స్థానికంగా జరిగే పలు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. 24న హైదరాబాద్ వెళ్లి అక్కడ కార్యక్రమాల అనంతరం 26న తిరిగి విశాఖపట్నం వస్తారు. 30న ఉదయం విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్ నుంచి కోల్‌కతా మీదుగా ఐజ్వాల్ వెళ్లనున్నారు. ఈ మేరకు సంబంధిత ఏర్పాట్లు చేయాలంటూ కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సంబంధిత అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రజా భాగస్వామ్యంతోనే డెంగీ నియంత్రణ



జబ్బర్‌తోటలో ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న డాక్టర్ శాంతిప్రభ తదితరులు

మహారాణిపేట : డెంగీ నియంత్రణకు ఇంటింటి సర్వే పక్కాగా నిర్వహించాలని జోనల్ మలేరియా విభాగం అధికారి డాక్టర్ శాంతిప్రభ అన్నారు. జబ్బర్‌తోటలో జీవీఎంసీ మలేరియా సిబ్బంది నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను, సిబ్బంది పనితీరును అడిషనల్ డైరెక్టర్ ప్రసాదరావు, జిల్లా మలేరియా అధికారి ఎం.తులసితో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా నివాసాలకు సమీపంలో ఉన్న నీటి నిల్వలను దగ్గరుండి తొలగించారు. ప్రతి శుక్రవారం జీవీఎంసీ, సచివాలయ ఆరోగ్య సిబ్బంది నిర్వహించే ఫ్రైడే డ్రైడేలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అప్పుడే వ్యాధులను నియంత్రించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి నగేష్ పట్నాయక్, ఆరోగ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

యువకుడికి ఆశ్రయం



యువకుడిని వసతి గృహానికి తరలిస్తున్న ఏయూటీడీ సిబ్బంది

అల్లిపురం : ఈ ఏడాది మే 15వ తేదీన విశాలాక్షినగర్‌లో అప్పన్న అనే యువకుడు మతిస్థిమితం లేకుండా రోడ్డుపై తిరుగుతుండగా ఏయూటీడీ సిబ్బందికి స్థానికులు సమాచారం అందించారు. దీంతో వారు అక్కడికి చేరుకుని ఆ యువకుడిని విశాఖ మెంటల్ కేర్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందజేశారు. అతని ఆరోగ్యం మెరుగుపడటంతో శుక్రవారం డిశ్చార్జి చేసి ఏయూటీడీ టీఎస్ఆర్ కాంప్లెక్స్ నిరాశ్రయ వసతి గృహంలో ఆశ్రయం కల్పించినట్లు కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు.

‘చేదోడు’తో భరోసా

తమను ఏ ప్రభుత్వాలు ఎప్పుడూ పట్టించుకోలేదని, జగనన్న ప్రభుత్వం వచ్చాకే తమకు గుర్తింపు దక్కిందని రజకులు, టైలర్లు, నాయీబ్రాహ్మణులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జగనన్న చేదోడుతో ఆర్థికంగా తమకు భరోసా కల్పించారని, ఆయన పాలనలో అన్ని వర్గాల వారు ఆనందంగా జీవిస్తున్నారని చెబుతున్నారు.

- చేతి వృత్తిదారులకు రూ.10 వేల ఆర్థిక సహాయం
- సంతోషం వ్యక్తం చేస్తున్న రజకులు, టైలర్లు, నాయీబ్రాహ్మణులు

నియోజకవర్గంలో చేతివృత్తి దారులకు గత నాలుగేళ్లుగా జగనన్న అందిస్తున్న సాయం
2019-20లో 97 మంది లబ్ధిదారులకు రూ. 9.70 లక్షలు
2020-21లో 97 మంది లబ్ధిదారులకు రూ. 9.70 లక్షలు
2021-22లో 169 మంది లబ్ధిదారులకు రూ. 16.90 లక్షలు
2022-23లో 174 మంది లబ్ధిదారులకు రూ. 17.40 లక్షలు





చేదోడు ఆసరాతో ఆనందం వ్యక్తం చేస్తున్న దర్జీ, రజక యువకుడు

జగదాంబ : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా రజకులు, నాయీ బ్రాహ్మణులు, టైలర్లకు ఏడాదికి రూ.10 వేలు అందిస్తూ ఆ కుటుంబాలకు పెద్ద కొడుకుగా నిలుస్తున్నారు. ఇచ్చిన హామీ ప్రకారం ఈ ఏడాది కూడా జగనన్న చేదోడు పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు నేరుగా వారి ఖాతాలకు నగదు జమ అయింది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అన్ని కులాలు, చేతి వృత్తిదారులకు ప్రత్యేక గుర్తింపునిచ్చారని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చేదోడుతో వచ్చిన డబ్బు ఇంటి అవసరాలకు ఎంతో ఉపయోగపడుతుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కులవృత్తుల వారికి, చేతివృత్తిదారులకు, చేదోడు, చేయూత, విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన, పెద్ద చదువులు చదుతున్న వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్, కులధ్రు పత్రాలు ఇంటికే వచ్చే విధంగా సురక్ష, ఇప్పుడు జగనన్న ఆరోగ్య సురక్ష వంటి పథకాలతో జగనన్న అందరినీ ఆదుకుంటున్నారని లబ్ధిదారులు చెబుతున్నారు.

మాట తప్పని నాయకుడు..



మాట తప్పని నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నారు. చేతివృత్తిదారులందరికీ చేదోడుతో ఆదుకుంటున్నారు. సంతోషంగా ఉంటున్నాం.

–చింతపల్లి గంగాధర్, టైలర్, వన్‌టౌన్, 39వ వార్డు

పేదలకు చేదోడు..



జగన్‌మోహన్‌రెడ్డి రజకులను గుర్తించారు. చాలీచాలని సంపాదనతో బతుకుతున్న వారిని చేదోడు పథకం ద్వారా జగనన్న ఆదుకుంటున్నారు. ఈ పథకం వలన ఎందరో బడుగు బలహీన వర్గాల కుటుంబాలకు ఆసరా కల్పించినట్లయింది.

–రాజులు, లాండ్రీ దుకాణం, 39వ వార్డు

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్



36వ వార్డు జామియా మసీదులో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

అల్లిపురం : ప్రజలకు అండగా ఉంటానని, సమస్యల పరిష్కారానికే ప్రతి వారం పలు ప్రాంతాల్లో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తెలిపారు. 34వ వార్డు అచ్చియ్యమ్మపేట డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వాటిపై అధికారులతో మాట్లాడి పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి, జేసీఎస్ అధ్యక్షుడు కర్రి నీలకంఠం, వైఎస్సార్‌సీపీ నాయకులు లండా రమణ, లింగం శ్రీనివాసరావు, బోణి దేవ, దూడ అప్పారావు, వాసుపల్లి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

36వ వార్డులో..

ఏవీఎస్ కాలేజీ దరి జామియా మసీదు వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే వాసుపల్లి పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వాటి తక్షణ పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం, సౌత్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ముజీబ్‌ఖాన్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోణి దేవ, ముస్లిం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి



క్షేత్ర పర్యటనలో అధికారులను ఆదేశిస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

డాబాగార్డెన్స్ : అభివృద్ధిలో భాగంగా చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ పేర్కొన్నారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా శుక్రవారం జోన్–4, 6 అధికారులతో కలిసి రోడ్డు అభివృద్ధి పనులు, ప్రతిపాదిత పెట్రోల్ బంకుల స్థలాలు పరిశీలించారు. ముందుగా జోన్–4 పరిధి కాన్వెంట్ జంక్షన్ సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ సమీపాన హెచ్‌పీసీఎల్‌చే జీవీఎంసీ కోసం ప్రతిపాదిత పెట్రోల్ బంకు స్థలాన్ని పరిశీలించారు. సీసీపీ సునీత, జోనల్ కమిషనర్లు శివప్రసాద్, సింహాచలం, ఎస్‌ఈ గోవిందరావు, ఈఈ మత్స్యరాజు, ఏసీపీలు వినయ్‌ప్రసాద్, శ్రీలక్ష్మి, ఏఎంవోహెచ్ సీహెచ్ సత్యనారాయణ, ఏఈలు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

పేదలకు అండగా జగనన్న ఆరోగ్య సురక్ష



వృద్ధురాలి కళ్లను పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది



పోషకాహారం ప్రత్యేకతను వివరిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

అల్లిపురం : పేదలకు అండగా జగనన్న ఆరోగ్య సురక్ష నిలుస్తుందని 33,34,35,41 వార్డుల క్లస్టర్ మండల అధ్యక్షుడు కర్రి నీలకంఠం అన్నారు. జీవీఎంసీ 33వ వార్డు వేంకటేశ్వరమెట్ట –2 సచివాలయం పరిధి కొబ్బరితోట డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ శిబిరంలో 281 మంది వైద్యుల సేవలను వినియోగించుకున్నారు. వారిలో ఒకరిని న్యూరాలజీకి, మరో ఇద్దరిని పీడియాట్రీషన్‌కు రిఫర్ చేశారు. మందులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్తలు పోషకాహారం, చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాలను ప్రదర్శించారు. వాటి వల్ల కలిగే ప్రయోజనాలను శిబిరానికి వచ్చిన వారికి వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బొర్రా శ్రీనివాసరెడ్డి, మదాబత్తుల రమేష్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న జెడ్సీ శివప్రసాద్, కార్పొరేటర్ నారాయణరావు

దండుబజార్ సచివాలయం వద్ద..

మహారాణిపేట : ప్రతి వ్యక్తి ఆరోగ్యంగా ఉండాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టారని కార్పొరేటర్ ఉరికిటి నారాయణరావు అన్నారు. జీవీఎంసీ 29వ వార్డు దండుబజార్ సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని కార్పొరేటర్ నారాయణరావు, జోనల్ కమిషనర్ శివప్రసాద్ ప్రారంభించారు. పోషకాహార ప్రదర్శనను తిలకించి స్టాళ్లను పరిశీలించారు.

వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, ఆశ వర్కర్లు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఉద్యోగుల గ్రీవెన్స్‌డే నిర్వహణ



ఉద్యోగుల నుంచి వినతులు స్వీకరిస్తున్న డీఆర్‌వో మోహన్‌కుమార్

మహారాణిపేట : ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్ స్పష్టం చేశారు. శుక్రవారం తన ఛాంబర్‌లో ఉద్యోగుల సమస్యలపై గ్రీవెన్స్‌డే కార్యక్రమం నిర్వహించారు. వారి నుంచి డీఆర్‌వో అర్జీలు స్వీకరించారు. ఫిర్యాదులను సంబంధిత శాఖలకు అందించేందుకు కృషి చేస్తామన్నారు. వివిధ విభాగాలకు చెందిన ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ 12 వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

యుద్ధం ఆపి.. శాంతి నెలకొల్పాలి

సీతమ్మధార : పాలస్తీనాపై ఇజ్రాయిల్ తక్షణమే యుద్ధం ఆపి శాంతి నెలకొల్పే విధంగా ఐక్యరాజ్య సమితి జోక్యం చేసుకోవాలని సీపీఎం విశాఖ జిల్లా కమిటీ ప్రతినిధులు సింగ్ హోటల్ నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.లోకనాథం మాట్లాడుతూ చమురు నిక్షేపాలపై పట్టు కోసం ప్రపంచ పటంలో లేని ఇజ్రాయిల్‌ను అమెరికా సృష్టించిందన్నారు. మోదీ ప్రభుత్వం అమెరికాకు తొత్తుగా ఇజ్రాయిల్‌కు అనుకూలంగా ఉండటం దేశానికే ప్రమాదకరమన్నారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, కార్యదర్శి వర్గ సభ్యులు బి.పద్మ, ఆర్‌కేఎస్‌వీ కుమార్, బి.ఈశ్వరమ్మ, బి.జగన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వేగంగా ‘సురక్ష’ సర్వే



కల్లుపాకలు ప్రాంతంలో స్థానిక వ్యక్తి బీపీ పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

జగదాంబ : జీవీఎంసీ 35వ వార్డు పరిధిలో గల గాజులవీధి, ప్రసాద్‌గార్డెన్స్, కల్లుపాకలు, పండా వీధి, పూలసందు, లక్ష్మీనగర్ వీధి ప్రాంతాల్లో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే నిర్వహించారు. ప్రసాద్‌గార్డెన్స్ డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ కె. సందేష్ ఆధ్వర్యంలో ఏఎన్ఎంలు, సెక్రటరీలు, కన్వీనర్లు, గృహసారథులు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల వివరాలు నమోదు చేశారు. బీపీ, షుగర్, హెచ్‌బీతో పాటు పలు రకాల టెస్ట్‌లు నిర్వహించారు. సేకరించిన వివరాల ప్రకారం రోగులకు టోకెన్లు ఇచ్చి ఈనెల 28న జరిగే వైద్య శిబిరానికి తీసుకు రావడానికి చర్యలు చేపడతామని వైద్య సిబ్బంది పేర్కొన్నారు.

బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలి

కంచరపాలెం: బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ అన్నారు. కంచరపాలెం పరిధిలో ధర్మానగర్, తిక్కవానిపాలెం, ఆర్పీపేట, కంచరపాలెం, కప్పరాడ, కె.కాలనీ ప్రాథమిక, రామ్మూర్తిపంతులపేట హై స్కూళ్ల పరిధిలో శుక్రవారం ఆమె పర్యటించారు. పలు డ్రాప్ అవుట్ల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. బడి మానేసిన విద్యార్థులను తప్పకుండా బడికి పంపాలని వారిని కోరా రు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. దసరా సెలవులు అనంతరం పిల్లలు బడిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారుల కు సూచించారు. ఆయా పాఠశాలల హెచ్ఎంలతో ఫోన్‌లో మాట్లాడి డ్రాప్ అవుట్లు బడిలో చేరేలా బాధ్యత వహించాలని ఆదేశించారు. ఎస్ఎస్ఏ సిబ్బంది గీత, సీఆర్పీలు లంక చైతన్య, రత్నం పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యావాచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు.

కరుణ ప్రదాయిని.. శాంతి స్వరూపిణి

- కొనసాగుతున్న శరన్నవరాత్రి మహోత్సవాలు
- పలు రూపాల్లో భక్తులకు అమ్మవారి దర్శనం



కనకమహాలక్ష్మికి పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ తదితరులు



సరస్వతి అవతారంలో అనఘాలక్ష్మి



వీణావాణిగా దుర్గమ్మ



సరస్వతీదేవిగా కనకదుర్గమ్మ



అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అదనపు కమిషనర్ శ్రీనివాసరావు



సరస్వతీ అవతారంలో పూర్ణామార్కెట్ దుర్గాలమ్మ



కన్యకాపరమేశ్వరి ఆలయంలో చిన్నారులతో సరస్వతీ పూజ చేయిస్తున్న అర్చకులు

డాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవస్థానంలో శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం అమ్మవారు విద్యాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా శ్రీపుష్పయాగం పూజకు బెంగళూరుకు చెందిన జె. ప్రేమ్‌నాయుడు, విశాఖకు చెందిన బి. శ్రీనివాస్‌తో పాటు తొమ్మిది రోజులు అమ్మవారిని అలంకరించేందుకు పట్టుచీరలు అందించిన లక్కీ షాపింగ్ మాల్, సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ ప్రతినిధులు, అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు సత్యరూపవాణి, వెంకటరత్నం, ధనలత, అనురాధ, మారుతీప్రసాద్, సుబ్రహ్మణ్యం, మీసాల అశోక్‌కుమార్, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

గర్భాలయ ప్రవేశం లేదు..

దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రోజుకో అలంకరణలో అమ్మవారు దర్శనమివ్వనున్న దృష్ట్యా, ఆ సమయంలో భక్తులకు గర్భాలయ ప్రవేశం లేదని ఈవో శిరీష తెలిపారు. అదే విధంగా మధ్యాహ్నం పంచామృతాభిషేకం, గురువారం సహస్ర తులసీపూజ, శుక్రవారం క్షీరాభిషేక సేవ శరన్నవరాత్రుల సందర్భంగా రద్దు చేసినట్లు పేర్కొన్నారు. భక్తులు గమనించాలని ఈవో శిరీష తెలిపారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ..

కనకమహాలక్ష్మిని ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, దేవదాయ శాఖ ట్రిబ్యునల్ చైర్మన్ కె. వెంకటలక్ష్మీ హరినాథ్ దర్శించుకున్నారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వాగతం పలికి, వీరిచే అమ్మవారికి పూజ చేయించారు. వేద ఆశీర్వచనం అనంతరం అమ్మవారి ప్రసాదం అందజేశారు.

జీవీఎంసీలో అన్నప్రసాద వితరణ..

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని దుర్గమ్మ ఆలయంలో ధర్మకర్త ఒమ్మి సురేష్, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం అన్నప్రసాద వితరణ చేపట్టారు. అదనపు కమిషనర్లు డాక్టర్ వై. శ్రీనివాసరావు, ఎస్ఎస్ వర్మ, డాక్టర్ వి. సన్యాసిరావు పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ధర్మకర్త సురేష్ మాట్లాడుతూ అన్న ప్రసాద వితరణకు సహకరించిన మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ, ఉన్నతాధికారులు, అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, ఆలయ కమిటీ సభ్యులు జగన్, రాజు, హరిగోపాల్, అప్పలరాజు, వాసు, జీవీఎంసీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీదేవిగా సాగరగిరి కనకదుర్గమ్మ..

అల్లిపురం : యారాడ కొండపై వెలసిన సాగర గిరి కనకదుర్గమ్మ శుక్రవారం సరస్వతీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు ఫణికుమార్‌శర్మ ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు.

సరస్వతీదేవిగా అనఘాలక్ష్మి..

అల్లిపురం వివేకానందకాలనీలో వెలసిన సాయిబాబా దేవాలయంలో కొలువై ఉన్న అనఘాదేవి శుక్రవారం మహాలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు పవన్‌శర్మ అమ్మవారికి పూజలు చేశారు.

సరస్వతీదేవిగా దుర్గమ్మ..

అల్లిపురం మెయిన్‌రోడ్డులో వెలసిన దుర్గమ్మ శుక్రవారం సరస్వతీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

అమ్మదయ ఉంటే అన్నీ ఉన్నట్లే..

అల్లిపురం : అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్లే అని నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ నాయకుడు సీతంరాజు సుధాకర్ అన్నారు. అల్లిపురం బంగారుమెట్ట కాలనీలో దుర్గమ్మ ఉత్సవాలు బూర్లి చిన్నా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన అన్నసమారాధనను సీతంరాజు సుధాకర్, ద్రోణంరాజు శ్రీవత్సవ్ ప్రారంభించారు. ముందుగా వారు దుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో 33వ వార్డు అధ్యక్షుడు రంధి గోపీకృష్ణ, కణితి బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

పూర్ణామార్కెట్ జంక్షన్‌లో..

జగదాంబ : జీవీఎంసీ 35వ వార్డు పూర్ణామార్కెట్ జంక్షన్‌లో వెలసిన శ్రీ దుర్గాలమ్మ అమ్మవారు శుక్రవారం సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థానం ఈవో పి.శేఖర్‌బాబు ఆధ్వర్యంలో అర్చకులు అమర్‌నాథ్, కృష్ణ అమ్మవారికి పూజలు నిర్వహించారు.